క్లుప్తంగా

మంత్రి పొంగులేటిని కలిసిన కోరం కనకయ్య



మంత్రి పొంగులేటితో ఎమ్మెల్యే కనకయ్య

ఇల్లెందు: మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య సోమ వారం మర్యాదపూర్వకంగా కలిసి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఇటీవల తిరుమలాయపాలెం వద్ద మంత్రి కారుకు త్రుటిలో ప్రమాదం తప్పడంతో యోగ క్షేమాలు తెలుసుకున్నారు.

టెండర్ల రద్దుపై స్పందించాలి



మాట్లాడుతున్న ఎర్రా కామేశ్

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం, పాల్వంచ మున్సిపాలిటీల్లో టెండర్ల రద్దుపై స్థానిక ఎమ్మెల్యే స్పందించాలని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎర్రా కామేశ్ డిమాండ్ చేశారు. సోమవారం పార్టీ కార్యాలయంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొత్తగూడెం, పాల్వంచ మున్సిపాలిటీల్లో గతంలో ఎన్నడూ లేని విధంగా టెండర్ల ప్రక్రియ పూర్తయ్యాక సాంకేతి సమస్య అంటూ టెండర్లను రద్దు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. టెండర్ల రద్దు వెనక ఉన్నది ఎవరో నియోజకవర్గ ప్రజలకు తెలుసని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మాలోత్ వీరునాయక్, పోలె కనకరాజు, తాటిపాముల హరికృష్ణ, మురళి, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ మండల అధ్యక్షుల నియామకం



టేకులపల్లి: వివరాలు వెల్లడిస్తున్న హాథీరామ్‌నాయక్

టేకులపల్లి: బీజేపీ మండలాధ్యక్షుడిగా కోక్యా తండాకు చెందిన తేజావత్ శంభునాయక్ నియమితులయ్యారు. సోమవారం బీజేపీ టీచర్స్ సెల్ జిల్లా కన్వీనర్ వాంకుగోత్ హాథీరామ్‌నాయక్ వివరాలు వెల్లడించారు. జిల్లా కౌన్సిల్ సభ్యుడిగా ముత్యాలంపాడు క్రాస్‌రోడ్‌కు చెందిన ధారావత్ బాలాజీనాయక్ నియమితులయ్యారని చెప్పారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సారథ్యంలో కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత పేద ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారని తెలిపారు. కార్యక్రమంలో గొగ్గేల వెంకటేశ్వర్లు, జమాల్, సురేశ్, నరేశ్ అప్పారావు, నవీన్, బాలఆనంద్ తదితరుల పాల్గొన్నారు.
కొత్తగూడెంరూరల్: భారతీయ జనతా పార్టీ లక్ష్మీదేవిపల్లి మండల అధ్యక్షుడిగా మాలోతు గాంధీనాయక్, జిల్లా కౌన్సిల్ సభ్యులుగా జల్లారపు శ్రీనివాసరావును నియమిస్తూ సోమవారం నియామకపత్రాలను అందించారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర, జిల్లా నాయకులకు గాంధీనాయక్ కృతజ్ఞతలు తెలిపారు.

టీయూసీఐ ఆధ్వర్యంలో ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న టీయూసీఐ నేతలు

ఇల్లెందు: టీయూసీఐ అనుబంధ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ సంఘం ఆధ్వర్యంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎల్లన్న విజ్ఞాన కేంద్రం వద్ద జరిగిన సభలో టీయూసీఐ జిల్లా కార్యదర్శి యాకుబ్‌షావలి మాట్లాడుతూ.. ఈ నెల 19న మహబూబాబాద్ పట్టణంలో మహాసభ జరుగుతుందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ శాఖలో పనిచేసే కార్మికులు హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో మల్లెల వెంకటేశ్వర్లు, నాయిని కృష్ణ, విక్రమ్, వెంకన్న, కుమార్, శ్రీధర్, భారతి, భూలక్ష్మీ, ఉమా, మంగమ్మ, భాగ్యమ్మ, కృష్ణవేణి, రాజేశ్వరి, అనిల్, రాములు, నాగరాజు పాల్గొన్నారు.

ఘనంగా భోగి

భోగి పండుగను సోమవారం ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా జరుపుకునే పండుగ కావడంతో మహిళలు, యువతులు తెల్లవారుజామున నిద్రలేచి ఇంటి వాకిళ్లను శుభ్రం చేసి వివిధ రకాల రంగులతో ముగ్గులు వేశారు. రంగువల్లుల్లో గొబ్బెమ్మలతోపాటు పసుపు, కుంకుమ, నవధాన్యాలు, రేగిపండ్లు, పూలు, కాయలు పెట్టి పూజలు చేశారు. యువకులు, పెద్దలు గ్రామ కూడళ్లల్లో భోగి మంటలు వేశారు. మహిళలు, యువతలు, ఇంటిల్లిపాది తల స్నానాలు చేసి, నూతన వస్త్రాలను ధరించి దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. చిన్నారులకు భోగి పండ్లు పోశారు. చిన్న పిల్లల తలపై నుంచి రేగు పండ్లు, అంక్షితలు, నాణేలు, పూలు పోశారు. ఇంటింటా పిండి వంటల ఘుమఘుమలు, బంధువులు, అల్లుళ్ల రాకతో సందడి నెలకొంది. పలు దేవాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

-సాక్షి నెట్‌వర్క్



జూలూరుపాడు: కరివారిగూడెంలో ముగ్గు వేస్తున్న మహిళ



పాల్వంచరూరల్: భోగి మంటల వద్ద కొత్వాల శ్రీనివాసరావు, తదితరులు



జూలూరుపాడు: శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో భోగి మంటల వద్ద పూజ చేస్తున్న అర్చకులు



పాల్వంచరూరల్: ఆత్మలింగేశ్వరస్వామి ఆలయంలో వేసిన భోగి మంటలు



టేకులపల్లి: ముగ్గులు వేస్తున్న మహిళలు



సింగరేణి(కొత్తగూడెం): రామవరంలో చిన్నారిపై భోగి పండ్లు పోస్తున్న కుటుంబ సభ్యులు



టేకులపల్లి: భోగి పండ్లు పోస్తున్న మహిళ



కొత్తగూడెంటౌన్: వనందాస్‌గడ్డబస్తీలో పతంగులు ఎగురవేస్తున్న చిన్నారులు



ఇల్లెందురూరల్: భోగి మంటల వద్ద యువతులు



ఇల్లెందురూరల్: ముగ్గు వేస్తున్న చిన్నారులు



జూలూరుపాడు: కాకర్లలోని శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు



జూలూరుపాడు: పాపకొల్లు శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు



కొత్తగూడెంటౌన్: ముగ్గు వేస్తున్న యువతులు



ఇల్లెందు: బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ





ఇల్లెందు/టేకులపల్లి: పాఠశాలలకు సెలవులు ఇవ్వడంతో పిల్లలు ఇళ్లకు చేరారు. సంక్రాంతి పండుగ నేపథ్యంలో ఏ ఇంట చూసినా పిండి వంటల తయారీ కొనసాగుతోంది. అయితే, అంతా ఒకేసారి వంటలకు ఉపక్రమించడంతో పిండి పట్టే మిల్లుల వద్ద రద్దీ నెలకొంది.

భారతీయ సంస్కృతి ప్రపంచానికే ఆదర్శం

ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



ముగ్గుల పోటీల ప్రారంభ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

సింగరేణి(కొత్తగూడెం): భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు ప్రపంచానికే ఆదర్శంగా నిలుస్తాయని, భిన్నత్వంలో ఏకత్వం చాటుతున్న పండుగల ఉత్సవాలు ప్రజల మధ్య వ్యత్యాసాలను చెరిపేస్తున్నాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని సోమవారం రామవరం ఏరియాలోని పంజాబ్‌గడ్డలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. వీటిని ప్రారంభించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పాశ్చాత్య పోకడలకు దూరంగా ఉంటూ తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాల్సిన అవసరం నేటితరం యువతకు ఉందన్నారు. నైపుణ్యాన్ని ప్రదర్శించడానికి పోటీలు వేదికగా నిలుస్తాయని, కుటుంబాల మధ్య స్నేహ బంధం పెంపొందుతుందన్నారు. మహిళలు సమాజ పోకడలపై అవగాహన పెంచుకొని అందుకు అనుగుణంగా నడుచుకోవాలని, మహిళా రక్షణ చట్టాల అమలు, ప్రభుత్వ హామీల సాధనకోసం ఉద్యమాల వైపు అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్‌పాషా, జిల్లా నాయకులు కంచర్ల జమలయ్య, మునిగడప వెంకటేశ్వర్లు, పాటి మోహన్‌రావు, బరిగెల సంపూర్ణ, పెయ్యాల రంగారావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గోదారంగనాథుల కల్యాణం

పాల్వంచరూరల్: పాతపాల్వంచలోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో సోమవారం గోదారంగనాథుల కల్యాణమహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ధనుర్మాస పూజలో భాగంగా ఆలయ అర్చకులు కందాల సింహాద్రి ఆనంద కుమారాచార్యులు గోదారంగానాథుల కల్యాణాన్ని నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. కొత్వాల శ్రీనివాసరావు దంపతులు, కొత్వాల సత్యనారాయణ, కిలారి సుజాత, పుష్పాల వెంకటేశ్వర్లు, కృష్ణ, లోగాని రాంబాబు, కళావతి, సీతక్క, సత్యావతి, గాంధీ, కొండం వెంకన్న, శాంతి, వర్ధన్ పాల్గొన్నారు.



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

యువత క్రీడల్లో రాణించాలి



పాల్వంచరూరల్: క్రీడాకారులతో మాట్లాడుతున్న సీఐ వినయ్‌కుమార్



టేకులపల్లి: క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎస్ఐ శ్రీకాంత్

పాల్వంచరూరల్: యువత క్రీడల్లో రాణించడంతోపాటు మత్తు పదార్థాలు, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సీఐ వినయ్‌కుమార్ అన్నారు. మండలంలోని కిన్నెరసాని స్పోర్ట్స్ స్కూల్ క్రీడా మైదానంలో కొమరంభీమ్ క్రికెట్ టోర్నమెంట్‌ను సోమవారం ప్రారంభించారు. సీఐ ముఖ్య అతిథిగా హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకుని, తొలి మ్యాచ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత క్రీడల పట్ల మక్కువ చూపుతూనే గంజాయి, మద్యపానానికి దూరంగా ఉండాలని సూచించారు. క్రీడలతో మానసికోల్లాసంతోపాటు శారీరక దారుఢ్యం పెరుగుతుందని తెలిపారు. క్రీడలు స్నేహభావాన్ని పెంపొదిస్తాయన్నారు. కార్యక్రమంలో రూరల్ ఎస్ఐ బి.సురేశ్, టోర్నమెంట్ నిర్వాహకులు ఉదయ్, ఆరీఫ్, విక్రాంత్, సురేశ్, రామకృష్ణ, శ్యామ్, కొంగ అప్పారావు, ఖాసీం పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం

టేకులపల్లి: ఏటా సంక్రాంతి పండుగను పురస్కరించుకుని బోడు గ్రామంలో యూత్ ఆధ్వర్యంలో నిర్వహించే క్రికెట్ టోర్నమెంట్‌ను సోమవారం ఎస్ఐ పొడిశెట్టి శ్రీకాంత్ ప్రారంభించారు. క్రీడాకారులతో కలిసి క్రికెట్ ఆడి సందడి చేశారు. క్రికెట్‌తో పాటు మహిళలు, పురుషులు, యువకులు, యువతులు, చిన్నారులకు కబడ్డీ, తాడు లాగుడు, ముగ్గుల పోటీలు నిర్వహించారు.

పారిశుద్ధ్య సమస్యతో అవస్థలు



పోస్టాఫీస్ సెంటర్ డ్రెయినేజీలో పేరుకుపోయిన సిల్ట్

కొత్తగూడెంఅర్బన్: జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న డ్రెయినేజీలో సిల్ట్ పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోంది. కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్ సెయింట్ మేరిస్ పాఠశాల ఎదుట, రోడ్డుకు మరోవైపు డ్రెయినేజీలో సిల్ట్ పేరుకుపోవడంతో మురికినీరు ముందుకు వెళ్లే పరిస్థితి లేదు. దీంతో ఆ ప్రాంతంలో దుర్వాసన వెదజల్లుతోంది. పాఠశాలకు వెళ్లే విద్యార్థులు, ఉపాధ్యాయులు నానా అవస్థలు పడుతున్నారు. ఆ దారిలో వెళ్లే ప్రయాణికులకు సైతం ఇబ్బంది ఎదురవుతోంది. మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి జాతీయ రహదారి ఇరువైపులా డ్రెయినేజీలో సిల్ట్‌ను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

జీఎంకు వినతి

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పరిధి సీహెచ్‌పీలోని ప్రీవే బిన్‌లలో పనిచేసే వారిని వేబిన్ ఆపరేటర్లుగా గుర్తించాలని ఏరియా ఉపాధ్యక్షులు ఎండీ రజాక్ ఏరియా జనరల్ మేనేజర్ శాలేంరాజుకు వినతిపత్రం అందించారు. కొన్నేళ్లుగా ప్రీవేబిన్ ఆపరేటర్లుగా పనిచేసే వారిని కన్వేయర్ ఆపరేటర్లుగా గుర్తించారని, కానీ, వారు చేసే పనికి, డెజిగ్నేషన్‌కు సంబంధం లేకుండా ఉందని తెలిపారు.

విలీన సభను జయప్రదం చేయండి

టేకులపల్లి: విప్లవ కార్మిక సంఘాల ఐక్యత సమరశీల పోరాటాలకు ఊతం కానుందని భారత కార్మిక సంఘాల సమాఖ్య ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకులు డి.ప్రసాద్ అన్నారు. సోమవారం మండలంలోని తుమ్మలచలక గోడౌన్ కార్మికులతో కలిసి ఐఎఫ్‌టీయూ విలీనసభ వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈ నెల 18న కొత్తగూడెం క్లబ్‌లో విలీన సభ ఉంటుందని, బలమైన విప్లవ కార్మికోద్యమ నిర్మాణం విస్తరణ కోసం ఐఎఫ్‌టీయూ విలీనం అవుతున్నదని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలను ఎదుర్కోవాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బోడ మంచ, శ్రీరాములు, మహేశ్, బిచ్చు, రవి, బన్సి, మోతీలాల్, బాల, కిషన్, ప్రసాద్, శీను తదితరులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



ఇల్లెందు: వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఇల్లెందు: బలమైన విప్లవ కార్మికోద్యమ నిర్మాణం, విస్తరణ కోసం ఈ నెల 18న కొత్తగూడెంలో జరిగే ఇఫ్టూ విలీనం సభను విజయవంతం చేయాలని ఇఫ్టూ సంఘాల ప్రతినిధులు తోడేటి నాగేశ్వరరావు, ఎండీ రాసుద్దీన్ కోరారు. సోమవారం ఇల్లెందులోని సీహెచ్‌పీ, కోల్ ట్రాన్స్‌పోర్టు కార్మికులతో ఏర్పాటు చేసినసభలో వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఇరు సంఘాల నేతలు మాట్లాడుతూ 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా కుదించి అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. కార్యక్రమంలో మోహన్‌రావు, వెంకటేశ్వర్లు, రమేశ్, విజయ్, చిరంజీవి, చారి, ఆకాష్, బాలు పాల్గొన్నారు.

అదుపు తప్పితే.. అంతే సంగతులు

టేకులపల్లి: ఓవర్‌లోడ్‌తో ప్రయాణాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ప్రమాదమని తెలిసినా నిబంధనలకు విరుద్ధంగా వాహనాలపైకి ఎక్కి కూర్చుని ప్రయాణం చేస్తున్నారు. పత్తి, ధాన్యం, మొక్కజొన్న, కంకర, ఇసుక తదితర వాటిని రవాణా చేస్తున్న సమయంలో అసలే పరిమితికి మించి లోడ్ చేయడమే కాకుండా వాటిపై ప్రమాదభరితంగా కూర్చుని ప్రయాణిస్తుండటం గమనార్హం. అసలే రోడ్లు సరిగా లేవు. అడుగడుగునా గుంతలు ఉన్నాయి. దీంతో ఓవర్‌లోడ్‌తో పైన మనుషులను కూర్చోబెట్టుకుని వాహనాలు దూసుకుపోతున్న సమయంలో అదుపు తప్పితే ఇక అంతే సంగతులు. ప్రమాదాలు జరగకముందే తగిన నివారణ చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



ధాన్యం బస్తాలపై కూర్చుని ప్రయాణిస్తున్న దృశ్యం

టచ్ కూడా చేయకుండా!

జొన్న కంకులకు రక్షణ ఏర్పాట్లు



జొన్న కంకులకు తొడిగిన ప్లాస్టిక్ కవర్లు

ఆరుగాలం కష్టపడి పండించే పంటలను కోతులు, పందులు, పక్షుల నుంచి రక్షించుకునేందుకు రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. ఇందులో భాగంగానే టేకులపల్లి మండలం లచ్చతండాకు చెందిన రైతు హరిలాల్ వినూత్నంగా ఆలోచించాడు. ఆయన ఎకరం మిర్చి తోటలో ఇంటి అవసరాల కోసం అంతర పంటగా జొన్న వేశాడు. అయితే, పంట కంకి దశకు చేరగా పక్షులు దండయాత్ర చేస్తున్నాయి. చివరకు గింజలు మిగిలే పరిస్థితి లేకపోవడంతో ఆయన ప్రతీ జొన్న కంకికి ప్లాస్టిక్ కవర్‌తో తొడుగు ఏర్పాటు చేశాడు. దీంతో పక్షుల బాధ తప్పగా మంచు కురిసినా ఇబ్బంది ఉండదని హరిలాల్ తెలిపాడు.

– టేకులపల్లి